
సాక్షి ఒడిశా
సోమవారం । 16 । జూన్ । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 2,32,047
బంగారం : 320 మిల్లీ గ్రాములు
వెండి : 16 గ్రాములు - భువనేశ్వర్/పూరీ

రాష్ట్రమంతా అతిసారం

అతిసారం పక్కజిల్లాలకు వ్యాపిస్తోంది. పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.



- 8లో.



కలరా కట్టడికి తనిఖీలు

కలరా కట్టడికి అధికారులు కృషి చేస్తున్నారు. పలు చోట్ల తనిఖీలు చేస్తున్నారు.

- 8లో.

న్యూస్‌రీల్

వివాహిత అనుమానాస్పద మృతి

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ పోలీస్ స్టేషన్ పరిధి విక్రమంపూర్ గ్రామం దండాసి వీధిలో వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు నాలపండ గ్రామానికి చెందిన అనిత మండంగి (28)గా గుర్తించారు. అయితే అనిత మండంగిది హత్య అని ఆమె కుటుంబ సభ్యులు గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఐఐసీ కేకేబీకే కుహోరా తెలియజేసిన వివరాల ప్రకారం.. రెండేళ్ల క్రితం అనిత విక్రంపూర్‌లోని దండాసి వీధిలో నివసిస్తున్న హర్ష కుంభారికతో పెళ్లి జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం ఆమె ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి సైంటిఫిక్ బృందంతో చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. అనిత అత్తవారే ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని పోలీసులకు చేసిన ఫిర్యాదులో అనిత కుటుంబీకులు పేర్కొనడంతో కేసు మరో మలుపు తిరిగింది. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని ఐఐసీ కుహోరో తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



పదియా మడ్కమి మృతదేహం

మల్కన్‌గిరి: మామిడి చెట్టు పైనుంచి పడిపోయి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి పాత చిమాటపల్లి పంచాయతీకి చెందిన పదియా మాక్మమి (48) పండ్లు కోసం ఈ నెల 11వ తేదీన మామిడిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. దీంతో నడుము వద్ద బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు బలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి 11 గంటల సమయంలో పదియా మాక్మమి చనిపోయాడు. దీనిపై మృతుని సోదరుడు బలిమెల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఐఐసీ దీరాజ్ తన సిబ్బందిని మల్కన్‌గిరి పంపి మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అంబులెన్స్‌ను ఢీకొట్టిన లారీ



ప్రమాద దృశ్యం

రాయగడ: రాయగడ నుంచి కాసీపూర్‌కు వెళ్తున్న అంబులెన్స్‌ను వెనుకనుంచి లారీ ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్ అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టడంతో ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. అంబులెన్స్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. జిల్లాలోని టికిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్గిగుడ సమీపంలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని లారీని, లారీ డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. ప్రమాద సమయంలో అంబులెన్స్‌లో ఎవరూ లేరు.

లోయలో పడిన లారీ



లోయలో పడిన లారీ

రాయగడ: ఇనుము లోడుతో జిల్లాలోని గుణుపూర్ నుంచి రాయగడ వస్తున్న లారీ అదుపు తప్పి లోయలో పడింది. కొలనార సమితి ముకుందపూర్‌లో ఆదివారం ఈ ఘటన జరిగింది. ముకుందపూర్ ఘాటీ రోడ్డు మలుపు తిరుగుతుండగా అదుపు తప్పిన లారీ ఒక్కసారిగా లోయలో పడిపోయింది. 20 అడుగుల లోతులో పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు డ్రైవర్‌ను కొలనార ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల వ్యవధిలో ఈ ఘాట్ రొడ్డు వద్ద నాలుగు ప్రమాదాలు చోటు చేసుకోగా మలుపు వద్ద ఎలాంటి ప్రమాద నివారణ చర్యలను చేపట్టకపోవడంతో తరచూ ఇలాంటివి జరుగుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిఘా నడుమ పూరీ రథయాత్ర

• సన్నద్ధతకు మాక్ డ్రిల్



పూరీ రైల్వే స్టేషనులో ఉగ్రవాద వ్యతిరేక సాధన దృశ్యం



స్వాస్తి ప్రీమియం హోటలులో మాక్ డ్రిల్‌లో పాల్గొన్న బృందంతో అధికారులు

భువనేశ్వర్: పూరీలో శ్రీ జగన్నాథుని వార్షిక రథయాత్రని ప్రమాదరహితంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం నిరవధికంగా కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో రథయాత్ర నిర్వహణ, భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, జనసందోహం నియంత్రణపై చర్చించారు.

రథయాత్రకు ఉగ్రవాద ముప్పు పొంచి ఉన్నట్లు లభిస్తున్న సంకేతాల నేపథ్యంలో అనుబంధ యంత్రాంగం సన్నద్ధతని అనుక్షణం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సన్నద్ధత తనిఖీ చేయడానికి పూరీ పట్టణంలో పలు ప్రముఖ ప్రాంతాల్లో తరచూ మాక్ డ్రిల్ నిర్వహించాలని తెలిపారు. ఏదైనా ఉగ్రవాద కార్యకలాపాలను ఎదుర్కోవడానికి దట్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయడం గురించి ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ప్రత్యేక బుల్లెట్ ప్రూఫ్ భద్రతా వాహనాలు రంగంలోకి దింపేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు.

ఇంటెలిజెన్స్ డైరెక్టర్ ఆర్పీ కోచే, అదనపు డైరెక్టరు జనరల్ (శాంతి భద్రతలు) సంజయ్ కుమార్, రవాణా కమిషనర్, అదనపు డైరెక్టరు జనరల్ అమితాబ్ ఠాకూర్, అదనపు డైరెక్టరు జనరల్ దయాళ్ గంగ్వార్, ఎస్‌ఐడబ్ల్యూ డీఐజీ కన్వర్ హాకీట్ సింగ్, డీఐజీ ఎస్‌టీఎఫ్ పినాక్ మిశ్రా, పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు వినీత్ అగర్వాల్, పలువురు సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పూరీ రైల్వే స్టేషన్, జగన్నాథ ఆలయం ఎదురుగా ఉన్న బగాడియా ధర్మశాల, హోటల్ స్వాస్తి ప్రీమియం వంటి ప్రముఖ జనసందోహిత ప్రాంతాల్లో ఉగ్రవాద వ్యతిరేక బహుళ సంస్థల వర్గాలు మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. ప్రజా భద్రత పట్ల తక్షణ ప్రతిస్పందనను నిర్ధారించడానికి సమన్వయ సంసిద్ధతను బలోపేతం చేయడం ఈ చొరవ లక్ష్యంగా పేర్కొన్నారు.



బగాడియా ధర్మశాల ప్రాంగణంలో ఉగ్రవాద సన్నద్ధత కసరత్తు



పూరీ రథ యాత్ర ప్రాంగణం బొడొదండొ ప్రాంతంలో మాక్ డ్రిల్ దృశ్యం



పూరీ హోటలు స్వాస్తీ ప్రీమియంలో ఉగ్రవాద వ్యతిరేక మాక్ డ్రిల్ విన్యాసాలు

గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి



శుభాకాంక్షలు తెలియజేసిన డీజీపీ వై.బి.ఖురానియా

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ డాక్టరు కంభంపాటి హరి బాబు జన్మదినం పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ తదితర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు భగవంతుడు దీర్ఘాయుష్షు ప్రసాదించి ఉన్నత పాలన దక్షత కల్పించాలని వీరంతా ఆకాంక్షించారు.

• ఘనంగా శ్యామకాళీ ఊరేగింపు



ఆదివారం మాసాంత సంక్రాంతి సందర్భంగా పర్లాకిమిడి మెయిన్ మార్కెట్‌లో కాయగూరలు, మాంసం అమ్మకాలు బంద్ చేశారు. తెలుగు సొండివీధి మాశ్యామకాళీని పట్టణంలో మధ్యాహ్నం ఊరేగించారు. భక్తులు తమకు తోచిన విధంగా కానుకలు, బియ్యం సమర్పించారు. – పర్లాకిమిడి

వాటర్ షెడ్ ప్రాజెక్టుల పరిశీలన



అంబాగుడలో ప్రాజెక్టు పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ సభ్యులు

జయపురం: సమితిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వాటర్ షెడ్ ప్రాజెక్టులను కేంద్ర కమిటీ శనివారం సందర్శించింది. ముగ్గురు సభ్యుల కమిటీ అంబాగుడ ఉన్నత పాఠశాలలో వర్షపు నీరు సంరక్షణ ప్రాజెక్టును పరిశీలించింది. అనంతరం ఉమ్మిరి పంచాయతీలో నిర్మాణంలో ఉన్న అమృత సరోవరం చెరువుని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను ప్రశంసిస్తూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అంబాగుడ ఉన్నత పాఠశాలలో వర్షపు నీరు సంరక్షణ చెరువుని సందర్శించిన కేంద్ర కమిటీలో కేంద్ర వాటర్ కమిషన్ విభాగ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.ఆర్.ప్రసాద్, అసిస్టెంట్ ఇంజినీర్ చంద్రవీర సింగ్, కేంద్ర గ్రౌండ్ వాటర్ రీసెర్చ్ విభాగ ప్రభుత్వ హాడ్రో జువాలజిస్ట్ మున సుత్రధర్‌లు ఉన్నారు.

పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

భువనేశ్వర్: నగరంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఆదివారం పెరిగాయి. పెట్రోల్ ధర లీటరుకు రూ.101.55 కాగా, డీజిల్ ధర లీటరుకు రూ.93.11గా ఉంది. శనివారం పెట్రోల్ ధర లీటరుకు రూ.101.11, డీజిల్ ధర లీటరుకు రూ.92.69 ఉండగా 24 గంటల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 0.44 పైసలు పెరిగాయి. కటక్ నగరంలో భిన్నంగా పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గాయి. గత 24 గంటల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 0.09 పైసలు తగ్గాయి. ఆదివారం పెట్రోల్ ధర లీటరుకు రూ.101.20 ఉండగా, డీజిల్ ధర లీటర్‌కు రూ.92.75గా ఉంది.

రెండు వేర్వేరు చోట్ల గంజాయి స్వాధీనం



నందపూర్ పోలీసులు అరెస్ట్ చేసిన గంజాయి స్మగ్లర్లతో పాటు గంజాయి

కొరాపుట్: కొరాపుట్ జిల్లా నందపూర్ పోలీసులు రెండు వేర్వేరు చోట్ల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం నందపూర్–సిమిలిగుడ మార్గంలో ఐటీఐ, నలచువా జంక్షన్ల వద్ద తణిఖీలు నిర్వహించారు. డస్టర్ కారులో 27 కిలోల గంజాయి, మరో కారులో 25 కిలోల గంజాయి పట్టుబడింది. కేరళ రాష్ట్రానికి చెందిన శశి కుమార్, ఉత్తర్ ప్రదేశ్‌కి చెందిన మంజిత్ సింగ్, సంజయ్ కుమార్‌లను అరెస్ట్ చేశారు. నందపూర్ తహసీల్దార్ పార్వతి జొడియా మెజిస్ట్రేట్ హోదాలో గంజాయి సీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఏఎస్పీ మమతా పండా ప్రకటించారు.

అఖిల భారత చిరంజీవి యువత రక్తదానం



ర్యాలీ చేస్తున్న చిరంజీవి అభిమానులు



రక్తదానం చేస్తున్న యువకులు



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేసిన నిర్వాహకులు

జయపురం: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత ఒడిశా, జయపురం వారు శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక రక్తబండార్ నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేసేందుకు యువత పోటెత్తారు. ఈ సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత ఒడిశా అధ్యక్షుడు వై.శ్రీనివాసఖన్నా మాట్లాడుతూ.. శనివారం సినీ నటుడు, గ్లోబర్ స్టార్ రామచరణ్, ఉపసానల పెళ్లి రోజు కూడా కావటం వలన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ రక్తదాన శిబిరం నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించినట్టు చెప్పారు. దాతలకు ప్రశంసా పత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో చిరంజీవి యువత జయపురం సభ్యులు పాల్గొన్నారు.

జోలాపుట్ డ్యామ్‌లో పడి ఇద్దరు బాలల దుర్మరణం



ఒడ్డుకు చేరుస్తున్న దృశ్యం



ఒడ్డుకు చేరిన మృతదేహాలు




మృతదేహాలను వెలికి తీస్తున్న దృశ్యం



పుష్ప, దేవేంద్ర మృతదేహాలు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా జోలాపుట్ డ్యామ్‌లో ఇద్దరు బాల బాలికలు గల్లంతయ్యారు. ఆదివారం నందపూర్ సమితి అతండా గ్రామ పంచాయతీ బానుర్ గ్రామానికి చెందిన పుష్ప బైరాగి (15), దేవేంద్ర కిర్సాని (17)లు జోలాపుట్ డ్యామ్‌లో దలైపుట్ ఘాట్ సమీపంలో నీటిలో మునిగి పోయారు. వీరిద్దరూ స్నేహితులతో డ్యాం వద్దకు వచ్చారు. తర్వాత స్నేహితులను ఒడ్డున వదలి వీరిద్దరూ మత్రమే పడవ నడుపుకుంటూ నీటిలోపలకు వెళ్లారు. తొలుత పుష్ప నీటిలో పడిపోయింది. తర్వాత దేవేంద్ర నీటిలో పడిపోయాడు. దూరం నుంచి చూసిన స్నేహితులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. నందపూర్ నుంచి అగ్నిమాపక బృందాలు వచ్చి ఇద్దరి మృతదేహాలు వెలికి తీశారు. మృతుల తండ్రులు శివ బైరాగి,లక్కి కిర్సానిలు వేర్వేరుగా పాడువా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీరిద్దరి మృతదేహాలకు ఒకేచోట అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్తులు నిర్ణయించారు.

మాచ్‌ఖండ్ జలపాతంలో పర్యాటకుడు గల్లంతు



గల్లంతు అవ్వడానికి ముందు డుడుమ జలపాతం ముందు మేనమామ రంజన్ మహాపాత్రో కుటుంబంతో అన్వేష్ దాష్

కొరాపుట్: మాచ్‌ఖండ్ జలపాతంలో బెంగళూరుకు చెందిన పర్యాటకుడు గల్లంతయ్యాడు. బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉన్నత ఉద్యోగం చేస్తున్న అన్వేష్ దాస్(27) కొరాపుట్ జిల్లా మాచ్‌ఖండ్ సమీపంలోని డుడుమా జలపాతంలో గల్లంతయ్యాడు. భువనేశ్వర్‌లో నివసిస్తున్న మేనమామ రంజన్ దాస్ కుటుంబంతో కలసి అన్వేస్ కొరాపుట్ జిల్లాలో పర్యాటక ప్రాంతాలు తిలకించడానికి వచ్చాడు. మొదట దేవమాలి, రాణి డుడుమ జలపాతాలు తిలకించి డుడుమ జలపాతానికి వచ్చారు. అక్కడ 550 అడుగుల కిందకు అన్వేష్ దాస్ దిగాడు. తన బూట్లు విప్పి జలపాతంలో కాళ్లు కడుక్కోవడానికి దిగి మునిగి పోయాడు. ఈ విషయం తెలిసిన కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ గాలింపు చర్యలకు ఆదేశించారు. ఒడ్రాఫ్, అగ్ని మాపక, టూరిజం సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. అయినా జాడ తెలియరాలేదు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, హెచ్చరిక బోర్డులు పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ‘రొజ్జో’ సందడి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో రొజ్జో సంక్రాంతి పండుగను వైభవంగా నిర్వహించారు. జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి ఆదేశాల మేరకు ఈ భూమాత పండుగ రొజ్జోను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని సీడీపీఓ నేతృత్వంలో అన్ని సమితి అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీలలో ఆదేశించారు. రొజ్జో పండుగ సందర్భంగా మహిళలు కొత్త బట్టలు ధరించి, కాళ్ల చేతులకు గోరింటాకు పెట్టుకుని, ఊయల ఊగి తీపి వంటకాలు ఆరగించారు. ఆకాంక్ష సమితి కేంద్రాలు గుమ్మా, ఆర్.ఉదయగిరిలో సీడీపీఓ, ఐసీడీఎస్ అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



గిరిజన మహిళలు పిండివంటలు తింటూ..



మహిళ చేతులకు గోరింటాకు



మామిడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రొజ్జో సందడి



రొజ్జో పండగ సందర్భంగా ఊయలలు ఊగుతున్న మహిళలు

క్లుప్తంగా

తారు లారీ బోల్తా


ఘాట్ రోడ్డులో పడిన తారు

కొరాపుట్: జయపూర్–కొరాపుట్ ఘాట్ రోడ్డులో తారు లారీ బోల్తా పడింది. ఆదివారం కొరాపుట్ నుంచి జయపూర్ వస్తూ ఘాట్ రోడ్డులో జాతీయ రహదారి 26పై భరణీపుట్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగనప్పటికీ ట్యాంకర్ బద్దలై తారు నేల పాలయ్యింది. రోడ్డున పడిన తారు ఘాట్ రోడ్డు కిందకు ప్రవహించింది. నిత్యం వాహనాలు రద్దీ ఉండే మార్గం కావడంతో భరణీపుట్ అవుట్ పోస్టు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ నియంత్రణ చేశారు.

రాయిఘర్ మాజీ చైర్మన్ మృతి


కెధురాం జంకర్

కొరాపుట్: నబరంగ్పూర్ జిల్లా రాయిఘర్ సమితి మాజీ చైర్మన్ కెధురాం జంకర్ (70) మృతి చెందారు. ఆదివారం తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరగా పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు. ఈయన సుమారు 25 ఏళ్ల పాటు రాయిఘర్ సమితిలో బీజేడీకి మద్దతుదారునిగా ఉన్నారు. ప్రస్తుతం అతని కుమారుడు గుప్త జంకర్ రాయిఘర్ సమితి చైర్మన్‌గా కొనసాగుతున్నారు. మృతిపై మాజీ ఎంపీలు రమేష్ చంద్ర మజ్జి, ప్రదీప్ మజ్జిలు సంతాపం ప్రకటించారు.

ఘనంగా అంతర్జాతీయ పితృ దినోత్సవం

పర్లాకిమిడి: స్థానిక మహారాజా ప్యాలస్‌లో ఆదివారం సాయంత్రం ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పితృ దినోత్సవం, రోజ్జో ఉత్సవాన్ని ఆడంబరంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం కళాశాల విద్యార్థినులకు డ్యాన్సు, యాంకరింగ్, పాటలు పోటీలను ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జరిగిన రోజ్జో ఉత్సవ్‌లో విజేతలకు పలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి మహిళా సంఘటన్ అధ్యక్షులు కల్పనా పట్నాయక్ మాట్లాడుతూ.. రోజ్జో సంక్రాంతి ఆడపిల్లలకు ప్రత్యేకమన్నారు. కొత్తదుస్తులు ధరించి కాళ్లకు పారాణి వేసుకుని, రోజ్జో పిండివంటలు ఆరగించి, ఊయలు ఊగుతూ మూడు రోజులు ఆనందంగా గడుపుతారని అన్నారు. రోజ్జో సంక్రాంతి నాడు అంతర్జాతీయ పితృదినోత్సవం జరుపుకోవడం యాదృచ్ఛికమని ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనూజా శత్పథి అన్నారు. సమావేశంలో భాగవత్ పాఢి, గౌరవ అథితులుగా నర్సింగ గౌడో, హరిమోహన్ పట్నాయిక్, బినోదినీ సైన్సు కళాశాల ప్రిన్సిపల్ మనోజ్ పట్నాయిక్, లోకనాథ మిశ్రా పాల్గొనగా, న్యాయనిర్ణేతగా బిచిత్రా నంద బెబర్తా వ్యవహరించారు.

మోసం కేసులో వ్యాపారికి జైలుశిక్ష

ఇచ్ఛాపురం : పట్టణానికి చెందిన పెయింటింగ్ వ్యాపారి కాళ్ల శ్రీనివాసరావు 2017లో నకిలీ ఏషియన్ పెయింట్స్ తయారుచేసి అమ్ముతుండగా పట్టుబడటంతో పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసుకు సంబంధించి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నిందితునికి రెండున్నరేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించిందని పట్టణ ఎస్సై ముకుందరావు ఆదివారం తెలియజేశారు.

కిమ్స్‌లో అత్యాధునిక వైద్యసేవలు

అరసవల్లి: జిల్లాలో కిమ్స్ ఆసుపత్రితోనే కార్పొరేట్ వైద్యం పరిచయమయ్యిందని.. ఇప్పుడు అదనపు బ్లాక్ ద్వారా మరింత ఆధునిక సౌకర్యాలతో నాణ్యమైన వైద్యాన్ని అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కిమ్స్ ఆసుపత్రి నూతన బ్లాక్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యాన్ని సామాన్యులకు అందించేలా ఎన్‌టీఆర్ ఆరోగ్యశ్రీ పనిచేస్తుందని..రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ఏమాత్రం తగ్గిపోకుండా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియ విజయ, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, కిమ్స్ వ్యవస్థాపకులు డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, శీనయ్య, కృష్ణయ్య, మెడికల్ డైరక్టర్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ డాక్టర్ రవిసంతోష్, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ వేద తదితరులు పాల్గొన్నారు.

గొల్లగండి తీరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సోంపేట: గొల్లగండి సముద్రతీరానికి ఆదివాయం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం చేరింది. స్థానికులు గమనించి బారువ పోలీసులకు సమాచారం తెలియజేశారు. పోలీసులు ఘటనా స్థలానికి మృతదేహాన్ని పరిశీలించారు. బారువ ఏఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

రక్తదాతలకు ఘన సన్మానం


రక్తదాతల చైతన్య ర్యాలీ ప్రారంభిస్తున్న బీడీవో శక్తి మహాపాత్ర


మాట్లాడుతున్న బీడీవో శక్తి మహాపాత్ర


రక్తదాత కె.మోహనరావును సన్మానిస్తున్న అతిథులు

జయపురం: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా జయపురంలో చైతన్య ర్యాలీని నిర్వహించారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రథోపాడియ కూడలి నుంచి వందలాది మంది యువకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు, ఆస్పత్రి సిబ్బంది, సేవా స్వచ్ఛందసంస్థల సభ్యులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. జయపురం సమితి బీడీవో శక్తి మహాపాత్ర పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. 26వ జాతీయ రహదారి ప్రధాన కూడలి మీదరుగా జయపురం పాత సబ్‌డివిజన్ ఆస్పత్రి వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ ఉన్న సభాగృహంలో రక్తదాతలు,


ర్యాలీలో ఎన్‌సీసీ క్యాడెట్లు

రక్తదాతల మోటివేటెడ్ సంస్థలు పాల్గొన్న సభలో ఎక్కువ పర్యాయాలు రక్తదానం చేసి పలువురు ప్రాణాలు కాపాడిన 15 మంది దాతలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ.. రక్తదానం మహత్తర మైనదన్నారు. రక్తం దానం చేయండి ప్రాణదాతగా నిలవండి అనే నినాదానికి స్పందించి పలువురు రక్తం దానం చేస్తున్నారన్నారు. అటువంటి వారిలో ఎక్కువగా రక్తదానం చేసిన వారిని సన్మానించి ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు.


రక్త దాతల చైతన్య ర్యాలీలో నర్సింగ్ విద్యార్థినులు


సమావేశంలో రక్తదాతలు

కలరా తీవ్రత దిగ్భ్రాంతికరం: నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలో విస్తరించిన కలరాపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం కలవరపరుస్తోందని ప్రతిపక్ష నాయకుడు, విపక్ష బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. కలరా ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెట్టేసిందని, చాలా ఏళ్లుగా జాడ లేని మహమ్మారి కలరా ఇప్పుడు వివిధ జిల్లాల్లో ప్రజా జీవితాల్ని విపరీతంగా ప్రభావితం చేస్తోందన్నారు. జాజ్‌పూర్, కేంద్రాపడా, భద్రక్, పూరీ, కటక్ మరియు కెంజొహర్ వంటి జిల్లాల్లో కలరా తీవ్ర రూపాన్ని సంతరించుకుంటోంది. ఇతర జిల్లాలకు కూడా వ్యాపించడం ప్రారంభమైంది. ఇప్పటివరకు కలరా సోకి 14 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని నవీన్ పట్నాయక్ విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కలరా వ్యాప్తి ప్రాణాల్ని బలిగొంటున్న రాష్ట్ర ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని హితవు పలికారు. ప్రజల జీవితాలను మరింత ప్రమాదంలోకి నెట్టకుండా ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని, కలరా వ్యాప్తిని అరికట్టడానికి వెంటనే బలమైన చర్యలు చేపట్టాలని విపక్ష నేత అభ్యర్థించారు.


నవీన్ పట్నాయక్, విపక్ష నేత

ఆరోగ్య కేంద్రాలకు హై అలర్ట్

భువనేశ్వర్: అతిసార, కలరా రోగులు నమోదవుతున్న జిల్లాల్లో అన్ని ఆరోగ్య కేంద్రాలు హై అలర్ట్‌లో ఉండాలని, ప్రభావిత వర్గాలకు నిరంతరాయంగా ఆరోగ్య సేవలను అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదివారం ఆదేశించారు. జాజ్‌పూర్ జిల్లాలో తాగునీటి వనరులను శుద్ధి చేయడానికి తక్షణ చర్యలకు ముఖ్యమంత్రి ఆదేశాల్లో పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు రోడ్డు పక్కన ఉన్న ఆహార విక్రేతలపై ఆంక్షలు విధించారు. కాలుష్యాన్ని నివారించడానికి ఆహార భద్రతా తనిఖీలను ముమ్మరం చేశారు. పొరుగు జిల్లాలు కూడా అప్రమత్తంగా వ్యవహరించి నివారణ చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాల్లో పేర్కొన్నారు. అతిసారం, కలరా రోగాల వ్యాప్తి నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రభావిత ప్రాంతాలలో తగినంత మందులు, అవసరమైన వైద్య, చికిత్స సామగ్రి, ప్రత్యేక వైద్య బృందాలను మోహరించింది.


మోహన్ చరణ్ మాఝి

రాష్ట్రమంతా విస్తరిస్తున్న అతిసారం


ఆస్పత్రిలో రోగుల్ని పరామర్శించిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్

భువనేశ్వర్: జాజ్‌పూర్‌లో తలెత్తిన అతిసారం ముదిరి కలరాగా విజృంభించింది. ఇది క్రమంగా రాష్ట్రం అంతటా వ్యాపిస్తోంది. భద్రక్ నుంచి కటక్ తర్వాత కెంజొహర్ జిల్లాలకు విస్తరించింది. కలరా తీవ్రతతో మరణాలు పెరుగుతున్నాయి. జాజ్‌పూర్ జిల్లాలో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్ ఆదివారం జాజ్‌పూర్ సందర్శించి అనేక ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల పరిస్థితిని పరిశీలించారు. బాధితుల్ని పరామర్శించారు. ఆయా ఆస్పత్రుల్లో వైద్య , చికిత్స సౌకర్యాలను మంత్రి తనిఖీ చేశారు. మంత్రితో స్థానిక లోక్ సభ సభ్యుడు, బొడొచొణా, ధర్మశాల నియోజక వర్గాల ఎమ్మెల్యేలు, కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్, ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ నీలకంఠ మిశ్రా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. అశ్వత్థి అనేక ఆస్పత్రులను, జిల్లా ప్రధాన కార్యాలయ ఆస్పత్రి (డీహెచ్‌హెచ్)ను సందర్శించారు. కలుషిత నీటి ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి వేగం పుంజుకుటుందని భావిస్తున్నారు. ఆదివారం 2 మంది మరణించడంతో మృతుల సంఖ్య 13కి చేరుకుంది. 700 మందికి పైగా ఈ వ్యాధి బారిన పడి చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు 11 కలరా కేసులు ఖరారయ్యాయి. అపరిశుభ్రమైన ఆహారం, నీటిని ఉపయోగించవద్దని ఆరోగ్య శాఖ వర్గాలు స్థానికులకు సూచించారు. నీటి నిల్వల ప్రాంగణాల్లో బ్లీచింగ్ చిమ్మడం తదితర పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు.

కలరా కట్టడికి అధికార యంత్రాంగం తనిఖీలు


కలుషిత వండిన పదార్థాల్ని స్వాధీనం చేస్తున్న తనిఖీ బృందం


హోటళ్ల వంట గదిలో వ్యవహారాన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న ఆహార భద్రత బృందం సభ్యుడు

భువనేశ్వర్: కలరా శర వేగంగా విస్తరిస్తోంది. అధికార యంత్రాంగానికి ప్రధానంగా ఆరోగ్య, జిల్లా అధికార వర్గాల్ని కలవరపరుస్తుంది. సంక్రమణ తీవ్రం కావడంతో ఆహారం, నీరు కాలుష్యం నివారణకు అధికార యంత్రాంగం నడుం బిగించింది. ఈ వర్గాలు ఆస్పత్రుల్లో రోగులకు సముచిత చికిత్స, వైద్య సదుపాయాల్ని అనుక్షణం సమీక్షించడంతో పరిసర ప్రాంతాల్లో ఆహారం, తాగు నీటి కాలుష్యం స్థితిగతులపై నిఘా వేసింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) డైరెక్టర్ డాక్టర్ డి.బృందా, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ విజయ్ కుమార్ మహాపాత్రో జాజ్‌పూర్ జిల్లాలోని ధర్మశాల గ్రూప్ హెల్త్ సెంటర్, జిల్లా ప్రధాన ఆస్పత్రి, బొడొచొణ గ్రూప్ హెల్త్ సెంటర్‌లను ప్రత్యక్షంగా సందర్శించారు. జాజ్‌పూర్ జిల్లా మేజిస్ట్రేట్ బొడొచొణ మండలంలో వివిధ ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ప్రజలు ఉపయోగించే నీటి వనరులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ స్థాయిలో ఉపయోగించే నీటిని తనిఖీ చేసి క్రిమిసంహారక పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆహార భద్రతా యంత్రాంగం ప్రభావిత ప్రాంతాల్లో ఆహార పదార్థాల తయారీ, విక్రయ కేంద్రాలైన హోటళ్లు తదితర స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నారు. దాడుల్లో భాగంగా ఆహార కాలుష్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో పలు హోటళ్ళు, ఆహారం, తాగు నీరు ఉత్పాదన, విక్రయ కేంద్రాల్ని సీజ్ చేశారు.


కలుషిత ఆహారం పట్టుబడిన హోటలు రుచికా, సీజ్ చేస్తున్న అధికారులు


చికిత్స పొందుతున్న రోగులతో చర్చిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ అధికార వర్గం


కలరా సంక్రమిత ప్రాంతాల్లో బోరు నీరు పరిశుభ్రత పరిశీలిస్తున్న కలెక్టర్


జాజ్‌పూర్ ప్రాంతంలో బావి నీటి నిర్వహణ వ్యవస్థ పర్యవేక్షణలో కలెక్టర్

• గంజాయి స్వాధీనం


పట్టుబడిన గంజాయి, నిందితులను చూపిస్తున్న పోలీసులు

కొరాపుట్: జయపూర్ పట్టణ సమీపంలోని పంజాగుడ వద్ద గంజాయి పట్టుబడింది. ఆదివారం విశ్వసనీయ సమాచారం ప్రకారం జయపూర్ సదర్ పోలీసుస్టేషన్ పోలీసులు పంజాగుడ జంక్షన్ వద్ద ఆటోని వెంబడించారు. ఇది చూసి ఒక వ్యక్తి ఆటో నుంచి దూకి పరారయ్యాడు. అదే ఆటోలో సోదాలు జరపగా 88 కేజీల గంజాయి పట్టుబడింది. ఆటో ఉన్న గంజాయి స్మగ్లర్లు మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని గడపోదర్ గ్రామ పంచాయతీ ఈశ్వర్ గుడ గ్రామానికి చెందిన సుటి ముదలి, త్రినాథ్ ముదలిని అరెస్టు చేశారు. జయపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయానికి చెందిన అసిస్టెంట్ కలెక్టర్ సానియా నాయక్ మేజిస్ట్రేట్‌గా వ్యవహరించి గంజాయిని సీజ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సచింద్ర ప్రధాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బొల్లినేని భాస్కరరావు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ఆదివారం గ్రాడ్యుయేషన్ (జెనిత్స్–2020)డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెమ్స్ చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు బీఎస్సీ పారామెడికల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. పదేళ్లలో బొల్లినేని మెడిస్కిల్స్ ద్వారా పది వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో వారంతా ఉద్యోగంలో రాణిస్తున్నట్లు తెలిపారు. బీవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజింగ్ డైరెక్టర్ బొల్లినేని శీనయ్య మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెమ్స్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.సుధీర్ మాట్లాడుతూ వైద్య రంగంలో పారామెడికల్ టెక్నీషియన్స్ కీలక పాత్ర పోషిస్తారన్నారు. జెమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ఆర్.అశోక్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు గర్వపడేలా పిల్లలు నడుచుకోవాలన్నారు. జెమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి కేంద్రం ద్వారా ఇప్పటివరకూ పదివేల మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు.

మహేంద్రగిరి పరిరక్షణకు చర్యలు


సమావేశంలో మహేంద్రగిరి పరిరక్షణ కమిటీ సభ్యులు

పర్లాకిమిడి: పవిత్ర మహేంద్రగిరి పర్వత పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఒడిశా సాధుసంతవులతో కలిసి సమావేశం అయ్యారు. సమావేశానికి ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుంచి అనేకమంది సాధు, సంతవులు పాలొగని మహేంద్రగిరి ప్రాశస్త్యం, ఇక్కడ ఉన్న అసాధారణ అడవులు, ఔషధమొక్కలు కాపాడాలని తీర్మానించారు. సాధు, సంతవుల సమావేశంలో భాస్కర తీర్థ లక్ష్మీబాబా, బాబా ప్రఫుల్ల దాస్, సుధీర్ దాస్, హరిహార దాస్, మహంత రాధానంద దాస్, మోహన్ దాస్‌వైష్ణవ సంతువులు పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
- మహిళను బైక్‌తో ఢీకొట్టడంతో ప్రమాదం
- మృతుల్లో ఇచ్ఛాపురం హెడ్ కానిస్టేబుల్

టెక్కలి రూరల్/ఇచ్ఛాపురం రూరల్/సోంపేట: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. టెక్కలి మండలం ఒలేసాగరం సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన పాత్ర రవీంద్ర నాయకో కుటుంబ సభ్యులతో కలిసి సింహాచలం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శనివారం అర్ధరాత్రి టెక్కలి మండలం ఒలేసాగరం సమీపంలో జాతీయ రహదారిపై బస్సుదిగారు. ముందుగా భార్యాపిల్లలను రోడ్డు దాటించారు. అనంతరం తల్లి సుభద్రా నాయకో(58)ను రోడ్డు దాటిస్తుండగా ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ పొట్టి జగదీశ్వరరావు(45) ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొట్టారు. ఈ ఘటనలో సుభద్రా నాయకోతో పాటు జగదీశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే గాయపడిన వారిని టెక్కలి జిల్లాఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


జగదీశ్వరరావు (ఫైల్)

శిక్షణ కోసం వెళ్తూ..

కాగా, హెడ్ కానిస్టేబుల్ జగదీశ్వరరావు మృతితో విషాదఛాయలు అలముకున్నాయి. ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఈయన విజయనగరంలో శిక్షణ ఉండటంతో శనివారం రాత్రి తన ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. స్వగ్రామం సోంపేట మండలం ఎర్రముక్కాం. భార్య పుష్ప, ఇంజనీరింగ్ చదువుతున్న కుమారుడు సాయి ఉన్నారు. ప్రస్తుతం కుటుంబ సభ్యులు విశాఖపట్నంలో నివాసం ఉంటున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిస్తున్నట్లు తెలిపారు. ఈయన మృతికి సీఐ ఎం.చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ. ఈ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

నల్లబ్యాడ్జీలతో ఆందోళన

పర్లాకిమిడి: ఒడిశా నాన్ గెజిటెడ్ అటవీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దేవిగిరి రేంజ్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన జరిపారు. అనుగుల్‌లో ఒడిశా నాన్‌గెజిటెడ్ అటవీ సేవా సంఘం అధ్యక్షులు (అనుగుల్) జగబంధు పాత్రో ఆదేశాల మేరకు అత్యవసర సమావేశంలో అన్ని జిల్లాల్లో అటవీ సిబ్బంది నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. మే 24న ఢెంకనాల్ ఫారెస్టు డివిజన్ హిందోల్ రేంజ్‌లో పనిచేసిన వనరక్షకుడు ప్రహ్లాద్ ప్రధాన్‌ను అతి కిరాతకంగా కొందరు హత్యచేయడాన్ని అటవీ సంఘం ఖండించారు. ఈ హత్యకేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిపి మృతుని కుటుంబానికి కోటి రూపాయలు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వానికి అటవీ శాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఇదేకాక రాష్ట్రంలో ఫారెస్టు కమిషన్ ఏర్పాటుచేసి సిబ్బంది క్యాడర్, పదోన్నతి, ట్రెనింగ్, ఉద్యోగభర్తీలు చేయాలని, అటవీ ప్రాంతంలోపనిచేస్తున్న సిబ్బందికి పోలీసు విభాగం వలే వారికి జీతం అక్కౌంటు భీమా ప్యాకేజీ వర్తింపచేయాలని డిమాండు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ ఆందోళనలో ఫారెస్టర్ వెంకరమణ పాల్గొన్నారు.


దేవగిరి రేంజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అటవీ నాన్‌గెజిటెడ్ సిబ్బంది


క్లుప్తంగా

ముత్తాయివలసలో ఏనుగుల సంచారం


ముత్తాయివలస మామిడితోటలో ఉన్న ఏనుగుల గుంపు

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయివలస, కలవరాయి గ్రామాల మధ్య ఏనుగుల గుంపు సంచరిస్తోంది. శనివారం రాత్రి సీతానగరం మండలం నుంచి తరలివచ్చి ఆదివారం ఉదయానికి ఇక్కడి గ్రామాల్లోని మామిడితోటలో తిష్ట వేశాయి. దీంతో అలర్ట్ అయిన ఫారెస్ట్ సిబ్బంది గ్రామానికి చేరుకుని గ్రామస్తులకు, అటుగా వచ్చే ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. ఏనుగుల గుంపు వేరే ప్రాంతానికి తరలి వెళ్లేవరకు ఆయా గ్రామాలమీదుగా ప్రయాణికులు రాకపోకలు చేయకూడదని సూచించారు. కమ్మవలస సర్పంచ్ పిల్లా వసుంధర, ఫారెస్ట్ అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పేలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


వీరఘట్టం: చలివేంద్రిలో బీటలిచ్చిన ట్రాన్స్‌ఫార్మర్

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి గ్రామంలో శనివారం పడిన పిడుగులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ఇనుప రేకులు బద్దలు కావడంతో, లోపలున్న ఆయిల్ లీకైంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ స్పందించి ఆదివారం సాయంత్రానికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అలాగే వీరఘట్టంలో పిడుగులు పడడంతో సిటీకేబుల్ వ్యవస్థ దెబ్బతిని, ప్రసారాలు నిలిచిపోయాయి.

గృహోపకరణాలు దగ్ధం..

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల్లో శని, ఆదివారాల్లో కురిసిన ఉరుములు, పిడుగుల వర్షానికి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. మండల కేంద్రంలో 8 ఇన్వర్టర్లు, 10 ఫ్యాన్లు, 4 టీవీలు కాలిపోయాయి. పలుచోట్ల వీధి దీపాలు కూడా కాలిపోయాయి.

విజయనగరం ఐటీఐలో జాబ్‌మేళా రేపు

విజయనగరం అర్బన్: ఐటీఐ అభ్యర్థుల కోసం ఈ నెల 17న స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తామని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రానె మద్రాస్ లిమిటెడ్ అనే సంస్థలో వివిధ కేడర్ పోస్టులకు ఆ రోజు ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. 2024వ విద్యాసంవత్సరంలో ఐటీఐ పాసై, ఈ ఏడాది ఆగస్టులో పరీక్షలకు హాజరు కాబోయే చివరి సంవత్సరం వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులు ఈ మేళాకు హాజరయ్యే అర్హత ఉందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, 2 పాస్‌పోర్టు ఫొటోలతో హాజరు కావాలని తెలియజేశారు. పూర్తి వివరాల కోసం ఫోన్ 8106025022, 9849944654 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సంస్కృత కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహారాజా సంస్కృత కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. దక్షిణ భారతదేశంలో పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఏకైక సంస్కృత కళాశాల ఇదే. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తోంది. నామమాత్రపు ఫీజుతో కోర్సులు అందిస్తారు. దూర ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ వసతిగృహంలో సదుపాయాలు.. బ్రాహ్మణ విద్యార్థులకు సింహాచల దేవస్థానం ద్వారా ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారు.

కోర్సులివే..

పదో తరగతి ఉత్తీర్ణులకు (ఐదు సంవత్సరాల ఇంటర్ కోర్సులు) పీడీసీ – తెలుగు, పీడీసీ – సంస్కృతం.. ఇంటర్మీడియట్ విద్యార్థులకు (ఓఎల్ కోర్సులు) బీఏ – తెలుగు, బీఏ – సంస్కృతం, బీఏ హిస్టరీ, బీఎస్సీ కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు అన్ని రకాల పోటీ పరీక్షలకు అర్హులవుతారని, ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.జనార్ధననాయుడు సూచించారు.

రూ.10కి పడిపోయిన పైనాపిల్

సీతంపేట: స్థానిక మార్కెట్‌లో ఆదివారం పైనాపిల్‌ను ఒక్కొక్కటి రూ.10కి విక్రయిస్తున్నారు. గడిచిన వారం రూ.15 పలికిన ధర ఒక్కసారిగా రూ.10కి పడిపోవడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికంగా పైనాపిల్ దిగుబడి పెరగడం, మార్కెట్‌కు ఎక్కువగా తీసుకురావడంతో ధర పడిపోయినట్లు గిరిజనులు చెబుతున్నారు.

బియ్యం దొంగలను వదిలేస్తారా..!

- సంఘటన జరిగి పది రోజులవుతున్నా ఎక్కడ నుంచి తరలించారో తేల్చని వైనం
- బొండపల్లి మండలంలో పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం
- కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు


కొండకిండాం కోళ్లఫారంలో నార సంచుల్లో పట్టుబడిన పీడీఎస్ బియ్యం(ఫైల్)

విజయనగరం ఫోర్ట్: పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే సహించేది లేదు.. అక్రమార్కులు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరిస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దగ్గర నుంచి మంత్రుల వరకు ప్రగల్భాలు పలికారు. కాని వారి మాటలు ఉత్తుత్తివేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లాలో పీడీఎస్ బియ్యం పెద్ద ఎత్తున పట్టుబడినప్పటికీ అసలు దొంగలను ఇప్పటికీ పట్టుకోకపోవడంపై అధికారుల తీరుపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదలకు అందించే పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తుందనే విమర్శలున్నాయి. పీడీఎస్ బియ్యం తరలించే వ్యాపారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. జిల్లాలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించే పెద్ద ముఠా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ముఠాకు కొంతమంది అధికారులు, డీలర్లు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం వారికి పెద్ద ఎత్తున ముడుపులు ముడుతున్నట్లు సమాచారం.

బొండపల్లి మండలంలో పట్టుబడిన పీడీఎస్ బియ్యం..

పేద ప్రజలకు అందించే పీడీఎస్ బియ్యాన్ని కొంత మంది వ్యాపారులు పెద్ద ఎత్తున పక్కదారి పట్టించారు. బియ్యం తరలింపుపై విజిలెన్స్ అధికారులకు సమాచారం రావడంతో కొద్ది రోజుల కిందట బొండపల్లి మండలం కొండకిండాంలోని కోళ్ల ఫారంలో 106 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం.. కిండాం అగ్రహారం మామిడితోటలో 43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. రేషన్ దుకాణాల్లో ఉండాల్సిన పీడీఎస్ బియ్యం కోళ్ల ఫారంకు, మామిడి తోటల్లోకి తరలించడం సంచలనంగా మారింది. అయినప్పటికీ అధికారులు ఇంతవరకు అసలు దొంగలను పట్టుకోకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

ఏ డిపో బియ్యమో తేలలేదు..

జూన్ 5వ తేదీన పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. సంఘటన జరిగి పది రోజులవుతున్నా ఏ రేషన్ దుకాణం నుంచి నేరుగా తరలించారో.. ఎవరు సహకరించారో.. ఇంతవరకు తేలలేదు. దీంతో అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసును నీరుగార్చడానికి అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు అందాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచారణ చేస్తున్నాం..

పీడీఎస్ బియ్యాన్ని తరలించిన వ్యాపారులపై కేసులు నమోదు చేశాం. వారు ఎక్కడ నుంచి బియ్యం తరలించారో విచారిస్తున్నాం. అసలు దొంగలను పట్టుకుని తగిన చర్యలు తీసుకుంటాం.

కె. మధుసూదనరావు,
జిల్లా పౌరసరఫరాల అధికారి

నిబంధనలు తప్పనిసరి

- ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించాల్సి వస్తే నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమాలు నిర్వహించే వ్యక్తులు వారం రోజుల ముందే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో తెలియజేసి సబ్‌డివిజనల్ అధికారుల నుంచి అనుమతి పొందాలన్నారు. అదేవిధంగా దరఖాస్తు చేసుకున్న వ్యక్తులు వారి మొత్తం వివరాలు వెల్లడిస్తూ ఎందుకు నిర్వహిస్తున్నారో? ఎంతమంది వస్తున్నారో? అన్న వివరాలతో పాటు ప్రారంభ, ముగింపు సమయం, సభా స్థలం, రూట్ మ్యాప్ వివరాలు కూడా తెలియజేయాలని చెప్పారు. పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు


సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయి సీనియర్స్ స్త్రీ, పురుషుల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 14వ తేదీ నుంచి 15 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి 8 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించి, ఐదు పతకాలు కైవసం చేసుకున్నారు. లాంగ్‌జంప్‌లో ఎ.లక్ష్మి బంగారు పతకం చేజిక్కించుకోగా... పి.వసంత 100 మీటర్ల పరుగు పోటీలో బంగారు పతకం, 200 మీటర్ల పరుగుపోటీలో వెండి పతకం దక్కించుకున్నారు. అదేవిధంగా ట్రిపుల్ జంప్‌లో ఎం.బాలరాజ్ బంగారు పతకం చేజిక్కించుకోగా... 3000 మీటర్ల పరుగు పోటీలో ఎస్.అశోక్ బంగారు పతకంతో రాణించాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

బహిరంగ ప్రదేశాల్లో మందు తాగితే చర్యలు

- ఎస్పీ వకుల్ జిందల్


ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని ఎస్పీ వకుల్‌జిందల్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా దాడులు చేపడుతూ మద్యంబాబులను అరెస్ట్ చేశామన్నారు. నగర శివార్లతో పాటు జిల్లా వ్యాప్తంగా డ్రోన్స్ ద్వారా తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. మందుబాబులతో పాటు వాహన తనిఖీలు, రహదారి భద్రతా నియమాలను ఉల్లఘించిన వారిని గుర్తించి ఈ చలాన్ విధిస్తున్నట్లు తెలిపారు. గడిచిన ఐదు నెలల్లో 2,178 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 9,095 మందిపై కేసు నమోదు చేశామన్నారు. పోలీసులకు పట్టుబడిన వారికి ముందుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని.. రెండోసారి పట్టుబడితే కేసులు తప్పవని.. మూడోసారి కూడా పట్టుబడితే అరెస్టు ఖాయమని హెచ్చరించారు.

దళితుల భూముల దురాక్రమణపై విచారణ


క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు దళితులకు సంబంధించిన భూములను టీడీపీ నాయకులు ఆక్రమించుకోవడంతో మండల రెవెన్యూ అధికారి కె. సన్యాసిరావు ఆధ్వర్యంలో సిబ్బంది విచారణ నిర్వహించారు. భూముల ఆక్రమణ వ్యవహారంపై సాక్షి పత్రికలో 'దళితల భూముల దురాక్రమణ' శీర్షికన ఆదివారం కథనం ప్రచురితమైంది. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొత్తపల్లి సన్యాసిరావు, వీఆర్‌ఓ పూర్ణిమ, తదితరులు స్పందించి ఆ భూముల వద్దకెళ్లి విచారణ జరిపారు. ఈ భూములు ప్రభుత్వ గెడ్డ వాగుభూమికి సంబంధించినవని అధికారులు తెలిపారు. తహసీల్దార్ కోరాడ శ్రీనివాస రావు విశాఖపట్నంలో జరగనున్న యోగా డే కార్యక్రమానికి వెళ్లారని, ఆయన వచ్చి విచారణ చేపట్టేవరకు ఆ భూముల్లో ఎటువంటి పనులు చేపట్టరాదని ఆర్‌ఐ సన్యాసిరావు స్పష్టం చేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న దళితల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్ద పెదిరెడ్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


లారీని ఢీ కొట్టిన ఆటో


కనకారెడ్డి (ఫైల్)

పూసపాటిరేగ: మండల పరిధి గొల్లపేట సమీపంలో సర్వీస్ రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఆటో ఢీ కొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. కిలుగుపేటకు చెందిన జీరు కనకారెడ్డి (41) ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం సీహెచ్ అగ్రహారం ఫ్లై ఓవర్ వద్ద కూరగాయల లోడు దించేసి తిరుగు ప్రయాణంలో పూసపాటిరేగ వెళ్తుండగా గొల్లపేట సమీపంలో నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో కనకారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య తోటమ్మ, కుమారులు రాము, రమణ ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

డెంకాడ: మండలంలోని అక్కవరం పంచాయతీ పరిధిలో గల ఓ లే అవుట్‌లోని విద్యుత్ స్తంభానికి ఉరిపోసుకుని బోర సూరిబాబు (35) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఎ.సన్యాసినాయుడు అందించిన వివరాలిలా ఉన్నాయి. భోగాపురం మండలంలోని సవరవల్లి పంచాయతీ పరిధి రామదాసుపేట గ్రామానికి చెందిన బోర సూరిబాబు వ్యాన్ డ్రైవర్‌గా పని చేసేవాడు. కొంత కాలం నుంచి ఎయిర్‌పోర్టుకు కూలీలను తీసుకువెళ్తున్న బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 15 రోజులుగా ఈ పనికి కూడా వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈనెల 14వ తేదీ రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో మద్యం సేవించి ఇంటికి వచ్చిన భర్త సూరిబాబును భార్య బోర గౌరి ప్రశ్నించింది. భోజనం చేయమని భార్య గౌరి చెప్పినా వినకుండా వెళ్లిపోయాడు. మరుసటి రోజు అక్కివరం పంచాయతీ పరిధిలోని ఒక లే అవుట్‌లోని విద్యుత్ స్తంభానికి ఉరిపోసుకుని ఉన్న సూరిబాబును స్థానికులు గుర్తించారు. భార్య గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి..


కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలోని బెలగాం రైల్వే స్టేషన్ శివారులో ఈ నెల 8న గాయాలతో పడిఉన్న గుర్తు తెలియని వ్యక్తిని స్టేషన్ మాస్టర్ శ్రీనివాసరావు గుర్తించి జీఆర్‌పీ పోలీసుల సహాయంతో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. ఆ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు రైల్వే హెచ్‌సీ రత్న కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం..

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం.. పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి


జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, తదితరులు

సాలూరు: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 99 శాతం హామీలను అమలు చేస్తే.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీల అమలులో విఫలమవుతున్నారని ఆరోపించారు. 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని పట్టణంలోని తన స్వగృహంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ.. 2019 – 20 మధ్య జగన్ మోహన్ రెడ్డి నాడు ముఖ్యమంత్రిగా చేసిన పాలనా వివరాలు.. నేడు 2024 – 25 ఏడాది కాలంలో నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన పాలనా వివరాలను పుస్తకంలో వివరించడం జరిగిందన్నారు.రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికలు, మహిళలపై వేధింపులు, అత్యాచారాలు అధికమవుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు ఒక్కొక్కరిపై 20కి పైగా కేసులు నమోదు చేశారంటే పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తుందనే అక్కసుతో సాక్షి మీడియాపై ఇటీవల దాడులు చేయించిన ఘనత చంద్రబాబు,లోకేష్‌కే దక్కుతుందని ఆరోపించారు.

అమ్మకు మోసం కాదా..?

గత ప్రభుత్వంలో ప్రతి తల్లికీ అమ్మఒడి ఇస్తామని హామీ ఇచ్చి శతశాతం నెరవేర్చిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాజన్నదొర అన్నారు. ఆనాడు పథకం అమలులో నిబంధనలు ఎక్కువగా పెట్టారని గగ్గోలు పెట్టిన టీడీపీ నాయకులు నేడు నిబంధనలు పెట్టలేదా అని ప్రశ్నించారు. తల్లికి వందనంలో రెండు వేల రుపాయలు లోకేష్ ఖాతాలోకి వెళ్లాయని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించడాన్ని టీడీపీ నాయకులు తప్పు బడుతున్నారని, మరి ఆ టీడీపీ నాయకులే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు వేల రూపాయలు జగన్ ప్యాలెస్‌కు వెళ్లిపోయాయని విమర్శించలేదా అని ప్రశ్నించారు.

150 పథకాలు అమలు చేయాల్సిందే..

సూపర్ 6తో పాటు 2014 – 19 మధ్య తమ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు జగన్ మోహన్‌రెడ్డి హయాంలో అమలైన పథకాలను కూడా తాము అమలు చేస్తామని టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని మాజీ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ లెక్కన సుమారు 150 సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు.

విత్తనాల వ్యాన్ బోల్తా..


బోల్తాపడిన వ్యాన్


వ్యాన్ నుంచి బయటకు తీసిన విత్తన బస్తాలు

రేగిడి: పాలకొండ మండలం తుమరాడ గ్రామానికి చెందిన కొంతమంది రైతులు పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వ్యాన్‌పై సంపత్ అనే వరి రకం విత్తనాలను తీసుకువస్తున్నారు. అయితే వ్యాన్ ఉంగరాడమెట్ట వద్దకు వచ్చేసరికి ఆదివారం వేకువజామున బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇదిలా ఉంటే రైతుసేవా కేంద్రాల్లో విత్తనాలు అందక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. విత్తనాలు దొరక్కపోవడం వల్లే ఇతర జిల్లాల నుంచి విత్తనాలు తెచ్చుకోవాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

9 మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని చోడమ్మ అగ్రహారంలో అనధికారికంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు భోగాపురం ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిందితుడి నుంచి మొత్తం 9 మద్యంసీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా ఎవరైనా అనుమతులు లేకుండా మద్యం తరలించినా, విక్రయించినా, మద్యం బెల్టుషాపులు నడుపుతున్నా సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

బడుగులపై కూలిన గోడ..!

- ఇద్దరి దుర్మరణం
- మృతుల్లో ఒకరు మూగవారు
- మిద్దె ఇల్లు మట్టి తవ్వుతుండగా ప్రమాదం


చిన్నయ్య (ఫైల్)


పైడితల్లి (ఫైల్)

గంట్యాడ:

పేదల కుటుంబాల్లో పెను విషాదం సంభవించింది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబసభ్యులు తీవ్రంగా రోదిస్తున్నారు. పేద కుటుంబాలకు పెద్ద కష్టం రావడంతో గ్రామమంతా అయ్యో పాపం అంటోంది. 25 ఏళ్లకు పైబడి కూలి పనులకు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అ కూలి పనికి వెళ్లే మృత్యువాత పడ్డారు. వయసు మీద పడినా కుటుంబ పోషణ కోసం కూలిపనులకు వెళ్లడం వారికి తప్పలేదు. రోజూ మాదిరిగా ఆదివారం కూలి పనికి వెళ్లారు. అదే వారికి చివరి పని అవుతుందని భావించలేదు. పనిచేస్తుండగా గోడ మీదపడడంతో ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ హృదయ విదారక సంఘటన గంట్యాడ మండలంలోని రామవరం గ్రామంలో జరిగింది. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామవరం గ్రామానికి చెందిన రీసు సత్యవతికి మిద్దె ఇల్లు ఉంది. ఆ ఇంటిని తొలగించి అందులో పశువులశాల కట్టేందుకు మిద్దె ఇంటిని కూల్చే పనులు చేపట్టారు. దీంతో ఆ పని చేసేందుకు అదే గ్రామానికి చెందిన ఎర్ర చిన్నయ్య(61), మూగ వ్యక్తి కొలుసు పైడితల్లి (49) వెళ్తున్నారు. శనివారం చాలావరకు మట్టిని తవ్వి తరలించారు. ఆదివారం ఉదయం 8:30 గంటల సమయంలో మిద్దె ఇంటి గోడను గునపంతో తవ్వుతుండగా ఒక్కసారిగా గోడ కూలి ఇద్దరు కూలీలపై పడిపోయింది. గోడ కింద వారిద్దరూ ఉండిపోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మరణించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయికృష్ణ తెలిపారు. మృతుడు చిన్నయ్యకు భార్య సత్యవతి, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. పైడితల్లికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దూరమైన పెద్దదిక్కు

మృతుడు చిన్నయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలు ముగ్గురికి వివాహాలయ్యాయి. చిన్నయ్య భార్యతో పాటు చిన్న కొడుకు దగ్గర ఉంటున్నాడు. కల్లు గీత సమయంలో కల్లుగీస్తుంటాడు. కల్లుగీత అయిపోయిన తర్వాత కూలి పనులకు వెళ్తారు. కూలిపనులు చేస్తూ వచ్చే ఆదాయం ద్వారా కుమార్తెకు, కుమారులకు పెళ్లిళ్లు చేశాడు. అందరినీ అల్లారు ముద్దుగా పెంచి అందరి యోగ క్షేమాలు చూసిన ఇంటి పెద్ద దిక్కు, తండ్రి అకస్మాత్తుగా మరణించడంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

మూగవాడైనా కాయకష్టంతో పోషించాడు

కొలుసు పైడి తల్లి మూగవాడు అయినప్పటికీ తన కాయ కష్టంతోనే కుటుంబాన్ని పోషించాడు. తన ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశాడు. ప్రస్తుతం భార్యతో కలిసి ఉంటున్నాడు. పైడితల్లి మృతి చెందడంతో ఇప్పుడు ఏవిధంగా బతకాలంటూ భార్య రోదిస్తోంది. తండ్రి ఆకస్మిక మృతితో కుమార్తెలు గుండెలవిసేలా బావురుమంటున్నారు.


రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు